క్లుప్తంగా

యనమల కృష్ణుడికి సత్కారం



తునిలో యనమల కృష్ణుడిని సత్కరిస్తున్న చేబ్రోలు వైఎస్సార్ సీపీ నాయకులు

తుని: ఇటీవల వైఎస్సార్ సీపీలో చేరిన యనమల కృష్ణుడును చేబ్రోలుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యనమల కృష్ణుడును శాలువాతో సత్కరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, తుని అసెంబ్లీ అభ్యర్థి దాడిశెట్టి రాజా విజయం కోసం పని చేస్తానని కృష్ణుడు తెలిపారు. తుని ఏఎంసీ మాజీ చైర్మన్ కొయ్యా మురళీ, చేబ్రోలు ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు నూజివీడు సూర్యప్రసాద్, ఓరిగంటి ప్రసాద్, కుందాస్ మాణిక్యం, చక్రధరుడు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్సైకి ఘనంగా వీడ్కోలు

ప్రత్తిపాడు: ఉద్యోగ విరమణ చేసిన ఏఎస్సై శిరిగిరి బాబూరావును ప్రత్తిపాడు పోలీసు సిబ్బంది మంగళవారం రాత్రి ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. సీఐ ఎం. శేఖర్‌బాబు, ఎస్సై ఎం.పవన్‌కుమార్ ఆధ్వర్యంలో బాబూరావును పూలమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని: విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ కె.రత్నాలరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలోని సాయినగర్, ఎంఆర్ పేట, ఫైర్ ఆఫీసు, శ్రీరామా థియేటర్, గొల్ల అప్పారావు సెంటర్, నక్కిన వీధి, చేపల మార్కెట్, గరువు వీధి తదితర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని ఆయన కోరారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ వితరణ



దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేస్తున్న దాత అక్షింతల రాజా, వైస్ ఎంపీపీ మైనర్‌బాబు

గోకవరం: మండలంలోని తంటికొండకు చెందిన దివ్యాంగుడు కొత్తపల్లి నాగేంద్రకు సనాతన ధర్మ ప్రబోధన సమితి ఉపాధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు అక్షింతల రాజా సహకారంతో ట్రై సైకిల్‌ని వితరణ చేశారు. తంటికొండలో బుధవారం జరిగిన కార్యక్రమంలో దాత అక్షింతల రాజా, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు చేతుల మీదుగా రూ.12 వేలు విలువైన సైకిల్‌ను నాగేంద్రకు అందజేశారు. కార్యక్రమంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబు, కొత్తపల్లి సత్యనారాయణ, పిల్లంగోరు పాపారావు, కొరిపల్లి అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు సేవలతోనే గుర్తింపు



కండక్టర్ కుమారి దంపతులను సన్మానిస్తున్న డిపో మేనేజర్ సత్యనారాయణ

ఏలేశ్వరం: ఉద్యోగులకు తమ విధి నిర్వహణలో చేసిన సేవల ద్వారానే గుర్తింపు వస్తుందని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ జీవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో మహిళా కండక్టర్‌గా పని చేసిన టీఎస్ కుమారి ఉద్యోగ విరమణ చేయడంతో బుధవారం కుమారి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27 ఏళ్లుగా పని చేసిన కుమారి తన సేవల ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ డిపో అధ్యక్ష, కార్యదర్శులు బినానిబాబు, యూబీఎం కుమార్, ఎస్ఎంయూ డిపో కార్యదర్శి త్రిమూర్తులు, జీవీ రామారావు, శేఖర్, రాజేశ్వరరావు, దేవి తదితరులు పాల్గొన్నారు.

బేటీ బచావో-బేటీ పడావో

గండేపల్లి: గ్రామంలో బుధవారం బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా బాలికా సంరక్షణ అధికారి సీహెచ్ వెంకట్రావు, జగ్గంపేట ఐసీడీఎస్ అధికారి పూర్ణిమ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ బాల్య వివాహాలు, బాలల హక్కులు, బాలల అక్రమ రవాణా, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. గ్రామాల్లో ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్య లు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే పథకాల కొనసాగింపు

- ఆ పార్టీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- పలు గిరిజన గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



శృంగధారలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వరుపుల సుబ్బారావు

శంఖవరం: రాష్ట్రంలో ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అధికారంలోకి రావాలని ఆ పార్టీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. పెద మల్లాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పి.మల్లాపురం, శృంగధార, అకంపాలెం, యరకాపురం, సిద్ధివారిపాలెం, వేళంగి పంచాయతీ పరిధిలోని పోలవరం గిరిజన గ్రామాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ పర్వత రాజబాబు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఇటీవల సీఎం జగన్ విడుదల చేసిన మేనిఫెస్టోతో పేద ప్రజలకు మరింత మేలు చేకూరుతుందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు అమలు కాని బూటకపు హామీలను ఇచ్చి ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రజలు టీడీపీ మేనిఫెస్టోను నమ్మే పరిస్థితి లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు గుండు సుధారాణి, మేఘం సుబ్బయ్యమ్మ, రామిశెట్టి ఏసుబాబు, ఈగల విజయదుర్గ, వైఎస్సార్ సీపీ నాయకులు ఈగల అప్పారావు, పడాల దొంగబాబు, పసగడుగుల నాగేశ్వరరావు, పాకల రాజు, ఆచంట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేద్దాం

ప్రత్తిపాడు: సంక్షేమ పథకాలు నిరంతరాయంగా కొనసాగేందుకు జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి చేసుకుందామని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు సతీమణి వెంకటలక్ష్మి పిలుపునిచ్చారు. ప్రత్తిపాడులో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా వరుపుల సుబ్బారావును, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ శేరుకృష్ణ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, డైరెక్టర్ గోళ్ల జయశేఖర్, పార్టీ నాయకులు వెంకటరత్నం, ఆకుల వీరబాబు, చెలంకూరి రాజబాబు, లవకుశ, చిలకమర్తి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో ఎన్నికల ప్రచారం చేస్తున్న వరుపుల సుబ్బారావు సతీమణి వెంకటలక్ష్మి

పేదల జీవితాల్లో వెలుగులు

రౌతులపూడి: నవరత్న పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు కోడలు వరుపుల ఊర్మిళ కోరారు. మండలంలోని ఎస్.అగ్రహారంలో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీశ్రేణులతో కలసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీశివకుమారి, పార్టీ ముఖ్యనేత వాసిరెడ్డి జమీలు, పార్టీ మండల కన్వీనర్ పోలుపర్తి తాతాజీ, సర్పంచ్ సర్నం శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు కొల్లు పల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు

- తోట నరసింహం కుమార్తె ప్రసూన, కోడలు శ్రీనిధి
- గుమ్మళ్లదొడ్డిలో ఎన్నికల ప్రచారం



గుమ్మళ్లదొడ్డిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ప్రసూన, శ్రీనిధి

గోకవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందాయని, ఆయా పథకాలు కొనసాగాలంటే ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం కుమార్తె ప్రసూన, కోడలు శ్రీనిధి అన్నారు. మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో బుధవారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై వేసి వైఎస్సార్ సీపీని మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేత పాటి రాంబాబు, సొసైటీ చైర్మన్ దాసరి చినబాబు, జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, నాయకులు సమ్మెటి నాని, సుంకర వెంకటరమణ, సరకణం మురళీ, చక్కిడాల పెద్దకాపు, బూలా అబ్బులు, సమ్మెటి రాంబాబు, పెనికేటి అచ్చిరాజు, అబ్బిరెడ్డి చిన్ని తదితరులు పాల్గొన్నారు.

జనసేన రెబల్ అభ్యర్థి ఎన్నికల గుర్తు మార్పు

గోకవరం: జగ్గంపేట జనసేన రెబల్ అభ్యర్థి పాఠంశెట్టి సూర్యచంద్ర ఎన్నికల గుర్తును ఎన్నికల అధికారులు మార్చారు. ఇటీవల ఆయనకు గాజు గ్లాసు గుర్తును కేటాయించగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గాజుల గుర్తును కేటాయించినట్టు ఆర్వో శ్రీనివాసరావు బుధవారం తెలిపారు.

బాధితులకు చేయూత

తొండంగి: మండలంలోని గోపాలపట్నంలో అగ్నిప్రమాద బాధితులకు నాసా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు చేయూతను అందించారు. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన చలగల సత్తెమ్మ కుటుంబానికి నాసా సంస్థ డైరెక్టర్ ఎస్.జ్యోతి ప్రేమదాస్ ఆధ్వర్యంలో బుధవారం బియ్యం, నిత్యావసరాలు అందించారు. కార్యక్రమంలో నాసా ప్రతినిధులు ఆర్.హేమలత, వి.దొంగబాబు స్థానికులు పి.సత్తిబాబు యు.రాంబాబు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

ప్రత్తిపాడు: ప్రతిఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని స్థానిక మినర్వా విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డీవీఎస్ రమేష్ రాజు సూచించారు. ప్రత్తిపాడులో చెవల ఆనందకుమార్ జోషీ ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ రితిష్‌పాల్ చెవల ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని 50 మంది నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మినర్వా చైర్మన్ మురళీకృష్ణ, హోప్ ఫౌండేషన్ చైర్మన్ మాసా ఇమ్మాన్యుయేల్, గుడాల సుందర్రావు, ఇంజనీర్ మోహన్ పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: కార్మికుల సంక్షేమం, శ్రేయస్సే వైఎస్సార్ సీపీ ధ్యేయమని ఆ పార్టీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. పట్టణంలో బుధవారం భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు శంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరుపుల మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్మికుల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. సీఎం జగన్ పాలనలో అన్నివర్గాలకూ మేలు జరిగిందన్నారు. కార్మికులకు వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కార్మికులంతా తమ పార్టీకి మద్దతు తెలపాలని కోరారు. సీఎం జగన్ మళ్లీ అధికారం చేపడితే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుంకర రాంబాబు, సామంతుల సూర్యకుమార్, పైల సుభాష్‌చంద్రబోస్, కోరాడ ప్రసాద్, పైల విజయ్‌కుమార్, సతివాడ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి



భావవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట నరసింహం

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం
- భావవరంలో ఆత్మీయ సమావేశం

జగ్గంపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు అందరం సమష్టిగా కృషి చేద్దామని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం అన్నారు. మండలంలోని భావవరంలో బుధవారం వైఎస్సార్ సీపీ నేత కంచి లక్ష్మణదొర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాల వారికి సంక్షేమ పథకాలు అందాయన్నారు. ఇటీవల సీఎం జగన్ విడుదల చేసిన మేనిఫెస్టో జనరంజకంగా ఉందన్నారు. కరోనా కష్టకాలంలోనూ సమర్థవంతంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఫ్లోరోసిస్ నివారణలో భాగంగా తన హయాంలో భావవరంలో భారీ రక్షిత మంచినీటి పథకాన్ని నిర్మించినట్టు తెలిపారు. దీంతో భావవరంతో పాటు మండలంలోని పలు గ్రామాలకు శుద్ధి చేసిన ఏలేరు జలాలను తాగునీరుగా అందిస్తున్నట్టు తెలిపారు. గతంలో మంత్రిగా, ఎమ్మెల్యేగా తాను చేసిన అభివృద్ధిని వివరించారు. అనంతరం గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించి ఎన్నికల ప్రచారం చేశారు. పార్టీ నేత కంచి లక్ష్మణదొర స్వగృహం వద్ద తోట నరసింహాన్ని గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ అప్పారావు కాపు, జగ్గంపేట సొసైటీ అధ్యక్షుడు బుర్రి చక్రబాబు, పార్టీ కిర్లంపూడి మండల అధ్యక్షుడు దోమాల గంగాధర్, జోకా శ్రీను, పార్టీ నేతలు బండారు రాజా, గఫూర్, బొదిరెడ్డి చక్రరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని మళ్లీ ఆశీర్వదించండి

- మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్ మల్లిక్
- అల్లిపూడిలో ఎన్నికల ప్రచారం

కోటనందూరు: అభివృద్ధి, సంక్షేమమే ఊపిరిగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ తుని ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్‌మల్లిక్ విజ్ఞప్తి చేశారు. మండలంలోని అల్లిపూడిలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, ఎంపీపీ లగుడు శ్రీనివాసు తదితరులతో కలిసి ఇంటింటా పర్యటించారు. మహిళలు, అవ్వాతాతలను ఆప్యాయంగా పలకరిస్తూ గత ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన మంచిని, పార్టీ ప్రకటించిన నవరత్నాలు ప్లస్ మేనిఫెస్టోను వివరించారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి తుని ఎమ్మెల్యేగా దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



అల్లిపూడిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న శంకర్‌మల్లిక్

అరుణపతాకం రెపరెపలు



ఏలేశ్వరంలో మేడే వేడుకలు నిర్వహిస్తున్న సీపీఎం పార్టీ శ్రేణులు



తొండంగి మండలం ఎ.కొత్తపల్లిలో బైక్ ర్యాలీ చేస్తున్న కార్మికులు

- ఘనంగా మేడే వేడుకలు
- ఐక్యత చాటిన కార్మికులు

ఏలేశ్వరం/తుని/గోకవరం/తొండంగి/ప్రత్తిపాడు/కిర్లంపూడి/జగ్గంపేట: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని (మే డే) బుధవారం తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. వాడవాడలా అరుణపతాకం రెపరెపలాడింది. గ్రామాల్లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. కార్మికులు జెండాలను ఎగురవేసి వందనాలు సమర్పించారు. ఏలేశ్వరంలో క్వారీ లారీ మోటారు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. సీపీఎం పార్టీ మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. తుని పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్మిక ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. గోకవరంలో ఎలక్ట్రికల్ యూనియన్, జట్టు కూలీ సంఘం, తాపీమేస్త్రీల సంక్షేమ సంఘం, రిక్షా కార్మికుల సంఘం ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, సొసైటీ చైర్మన్ దాసరి చినబాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, నరాలశెట్టి నర్సయ్య, తోలేటి రాంప్రసాద్ పాల్గొన్నారు. తొండంగి మండలం ఎ.కొత్తపల్లిలో కార్మిక సంఘం తుని ఏరియా కార్యదర్శి శివకోటి రాజు ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రత్తిపాడులోని లారీ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు రొంగల ఈశ్వరరావు మేడే పతాకాన్ని ఆవిష్కరించారు. కిర్లంపూడిలో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రజా సంఘాలు, అంగన్‌వాడీ, ఇందిరక్రాంతి పథం సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. జగ్గంపేట శివారు రంగవల్లి నగర్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పతాకాన్ని ఎగురవేశారు. భగత్‌సింగ్ నగర్ కాలనీలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మరుకుర్తి ఏసు జెండాను ఎగురవేశారు.

జగన్ పాలనలో అన్నివర్గాలకూ మేలు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు రాంజీ
- రాజపూడిలో ఎన్నికల ప్రచారం



రాజపూడిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట రాంజీ

జగ్గంపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకూ మేలు జరిగిందని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు తోట రాంజీ అన్నారు. మండలంలోని రాజపూడిలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. ఈ పథకాలన్నీ కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగ్గంపేట ఎమ్మెల్యేగా తోట నరసింహాన్ని, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త అత్తులూరి సాయిబాబు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ వుయ్యూరి నాని, పార్టీ నేతలు కర్ణం ఆదిరాజు, పినిశెట్టి లోవ, ధనిశెట్టి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.